క్లుప్తంగా

రూపుదిద్దుకుంటున్న సేవాలాల్, మారెమ్మ ఆలయం



లక్ష్మీతండాలో నిర్మిస్తున్న సేవాలాల్, మారెమ్మ ఆలయం

తుగ్గలి : మండలంలోని లక్ష్మీతండాలో విరాళాలతో నూతనంగా నిర్మిస్తున్న సేవాలాల్, మారెమ్మ ఆలయ నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. ఇప్పటికే దాదాపు రూ.40 లక్షల దాకా ఆలయ నిర్మాణానికి ఖర్చు అయినట్లు తండా వాసులు తెలిపారు. మార్చిలో నూతన ఆలయ ప్రతిష్ఠ ఉంటుందని పేర్కొన్నారు.

మాలధారులకు అన్నదానం



మాలధారులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సమీపంలోని బ్రహ్మ గుండం వద్దనున్న స్వయంభు ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, మాలధారులు దేవాలయంలో భజన కార్యక్రమం చేపట్టారు. అనంతరం హనుమాన్ మాలధారులు, దేవాలయానికి వచ్చిన భక్తులకు కృష్ణాపురం సర్పంచ్ ఎల్లస్వామి, ఆలయ నిర్వహకురాలు మాధవమ్మ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బేడ బుడగ జంగాల నాయకులు విభూది బాలు, షేక్ అమీర్, హరి నరసింహనాయుడు పాల్గొన్నారు.

6 నుంచి సుబ్రహ్మణ్యేశ్వర షష్టి ఉత్సవాలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

మద్దికెర : స్థానిక మద్దమ్మ చెరువు కట్ట మీద వెలసిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి ఉత్సవాలు ఈనెల 6 నుంచి 8 వతేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు విజయ్‌ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 6న ఉదయం గణపతిపూజ, సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తి ఊరేగింపు, రాత్రి సంగీత విభావరి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 7న ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ప్రభోత్సవం, రాత్రి 7 గంటలకు కూచిపూడి భరతనాట్యం కార్యక్రమలు ఉంటాయని చెప్పారు. 8న స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, అష్టోత్తర నామార్చన, రాత్రి తెనాలి, రాయలసీమ నటులతో ఉచిత నాటక ప్రదర్శన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ



కంది పైరుకు మందు స్ప్రే చేస్తున్న డ్రోన్

మద్దికెర : వ్యవసాయంలో రోజురోజుకు యంత్రీకరణ పెరిగిపోతోంది. మారిన పరిస్థితులతో అన్నదాతలకు వ్యవసాయం సులువైంది. ఆదివారం మద్దికెర గ్రామానికి చెందిన హరిబాబు అనే రైతు తన పొలంలో సాగు చేసిన కంది పైరుకు డ్రోన్‌తో పంటలకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయించారు. గతంలో మనుషులతో మందులు స్ప్రే చేయించేవారమని డ్రోన్‌తో చేయించడం వల్ల త్వరగా పనులు ముగుస్తున్నాయని రైతు చెప్పారు. ఎకరాకు రూ.400 ప్రకారం తీసుకున్నారని, గంటకు ఐదెకరాల పంటకు మందు పిచికారీ చేస్తుందని తెలిపారు. కూలీలతో పిచికారీ చేస్తే వంద లీటర్ల నీటిని వినియోగించాల్సి వస్తుందని, అదే డ్రోన్‌తో అయితే 15 లీటర్ల నీటితోనే పంట మొత్తానికి పిచికారీ చేయడం ద్వారా మందు ప్రభావవంతంగా పనిచేస్తుందని వివరించారు.

రేపటి నుంచి టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

మద్దికెర : ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు మండలంలోని పెరవలిలో వెలసిన శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో డాక్టర్ దేవిదయానంద్ సింగ్, స్థానిక భజన మండలి వారితో టీటీడీ వారి ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి వీరయ్య ఆదివారం తెలిపారు. 6వ తేదీ గోపూజ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

5నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఆలూరు: మండలంలోని మొలగవెల్లి గ్రామంలో ఈనెల 5,6వ తేదీల్లో శ్రీ చెన్నకేశవస్వామి రథోత్సవం కార్యక్రమం సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు పి.రాఘవేంద్ర, ఇ.లింగన్న కె.వి.తేజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు సెల్ 8374898107, 9515491861, 9491632144 నంబర్లు సంప్రదించాలన్నారు.

ఇంటి అందం అదరహో..

- ఇంటి నిర్మాణంలో కొత్త మోడళ్లపై పల్లె వాసుల మోజు
- ఖర్చుకు వెరవకుండా మోడళ్ల రూపకల్పన
- ఇళ్లకు హంగులు..ఆకట్టుకునేలా రంగులు
- అన్ని సౌకర్యాలు ఉండేలా నిర్మాణం
- పట్టణాలు, నగరాలకు తీసిపోని రీతిలో కట్టడాలు
- పల్లెల్లో నగటు నిర్మాణ ఖర్చు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు

• తుగ్గలి గ్రామానికి చెందిన మల్లికార్జున అనే సన్నకారు రైతు కొన్నేళ్లుగా కుంటుంబంతో కలిసి వ్యవసాయ పనులు లేనప్పుడు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆయా పట్టణాలు, నగరాల్లో కట్టుకున్న అందమైన భవంతులను చూసి ముచ్చటపడేవాడు. మనం కూడా ఇలా ఎందుకు కట్టుకోలేమని మనస్సులో అనుకున్నాడు. అంతే.. పంట దిగుబడుల నుంచి, పనులకెళ్లి కూడబెట్టుకున్న సొమ్ముతో ఊర్లో మూడు సెంట్ల స్థలంలో అందమైన ఎలివేషన్‌తో పాటు సౌకర్యాలన్నీ ఉండేలా ఇల్లు నిర్మించుకున్నాడు. ఈయనొక్కడే కాదు.. పల్లెల్లో ప్రస్తుతం నిర్మిస్తున్న ఇళ్లన్నీ ఆధునిక మోడల్‌లో పట్టణాలకు ఏమాత్రం తీసిపోని విధంగా కట్టుకుంటున్నారు.



పగిడిరాయిలో



జాఫ్లాతండాలో

తుగ్గలి : అందమైన ఇల్లు నగరాలు, పట్టణాల్లో మాత్రమే చూసే వాళ్లం. ఇదంతా గతం..ఇప్పుడు పల్లెల్లో సైతం ఖర్చుకు వెరకుండా అందమైన ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఎన్నాళ్లు బతికినా ఒకటే..ఉన్నన్నాళ్లు బాగుండాలి.. మంచి ఇల్లు కట్టుకోవాలి.. అనే కోరిక అందిరిలో బలంగా ఉంటోంది. ఒకప్పుడు ఇంటి నిర్మాణం చేశామా.. పూర్తయిందా.. ఏదో యాటికో కాటికి కట్టుకున్నామా..అని సంతృప్తి పడే వారు.. క్రమేణా.. ఇంటి నిర్మాణం పూర్తి అయితే అదే స్థాయిలో ఆ ఇంటికి ఎలివేషన్ ఉండాలి.. చూసేవాళ్ల కళ్లను ఆకట్టుకునేలా ఉండాలి.. ఇంట్లోనూ వాస్తుకనుగుణంగా అన్ని వసతులుండేలా అందంగా తీర్చిదిద్దుతున్నారు. నగరాలు, పట్టణాల్లో చేపట్టిన ఇంట డిజైన్లను పల్లె వాసులు చూస్తున్నారు. మరికొందరు వెబ్‌సైట్లు, నిపుణులను సంప్రదిస్తూ..ఖర్చుకు వెరవకుండా మోడళ్లను రూపకల్పన చేస్తున్నారు. ఒక్కొక్కరు ఒక్కో రకంగా హంగులు జోడిస్తున్నారు.

అన్ని సౌకర్యాలుండేలా..

గతానికి భిన్నంగా నిర్మాణాలు చేపడుతున్నారు. పల్లెల నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు అధిక శాతం సిమెంట్ పనికి వెళ్తున్నారు. అక్కడ ఇంటి నిర్మాణాలను దగ్గరుండి పరిశీలిస్తుండటంతో వారికి నిర్మాణాలు, డిజైన్లపై పూర్తి అవగాహన వచ్చింది. దీంతో చాలా ప్రాంతాల్లో సొంతంగా, ఇంటర్ నెట్‌లో శోధించి నిర్మాణ పద్ధతులను తెలుసుకొని బేల్దార్‌తో చర్చించి రూపుదిద్దుతున్నారు. ఇక ఇంటి వాస్తుకు ఆయా ప్రాంతాల్లో పేరుగాంచిన వాస్తు నిపుణులు, పట్టణాల్లోని ఇంజినీర్ల దగ్గరకెళ్లి స్థలం వివరాలు అందజేసి అనుకూలమైనట్లుగా, కావలసిన వసతులను చెప్పి డిజైన్ చేయించుకుంటున్నారు. ప్రస్తుతం పల్లెల్లో నిర్మించిన, చేపడుతున్న ఇళ్లను రూపురేఖలను చూస్తే అబ్బుర పరుస్తున్నాయి.

కాలానుగుణంగా మోడల్స్..

ఇటీవల కాలంలో కొత్తగా ఇళ్ల కడుతున్న వారు తప్పనిసరిగా ఎలివేషన్ చేస్తున్నారు. ఇంటి యజమానులు ఖర్చు వెనుకాడకుండా అందమైన మోడల్ వచ్చేందుకే ఎక్కువ ఆసక్తి చూపిస్తుంటే..మరికొంతమంది గ్లాస్ ఫిట్టింగ్‌లు, దేవుడి చిత్రపటాలు వచ్చేలా డిజైన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఏ పల్లెలో చూసినా కనీసం రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు మొదలు కొని ఆపైనా ఇంటి నిర్మాణానికి ఖర్చు చేస్తూ తమకు నచ్చి విధంగా కట్టుకుంటున్నారు. ఇంటి నిర్మాణానికి ఎంతఖర్చు చేస్తున్నారో ఎలివేషన్‌కు అంతే ప్రాధాన్యత ఇస్తున్నారు.

అధునాతన సాంకేతికత ఆధారంగా..

ఇంటి యజమానులు తమ ఇళ్లకు ఎలివేషన్ చేయించేందుకు వివిధ రకాల వెబ్‌సైట్లను సైతం చూస్తున్నారు. తమకు నచ్చిన మోడల్‌ను ఎంచుకొని ఆ విధంగా ఎలివేషన్ చేస్తుడంటం గమనార్హం. గతంలో కార్మికులు ఇది బాగుందంటే సరే అనే వారు. నేడు దానికి భిన్నంగా వెబ్‌సైట్‌లో ఓ మోడల్ చూసి చివరికి తనకు నచ్చిన ఒక దాన్ని ఎంచుకుంటున్నారు. అంతే కాక రెండు, మూడు మోడల్స్ చూసి ఆ రెండింటినీ కలిపి ఇంకా ఏమైనా మోడల్ తీర్చిదిద్దొచ్చా అనే కోణంలోనూ ఆలోచిస్తున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పట్టణాలు, నగరాల్లో మాదిరిగా వివిధ రకాల ఎలివేషన్ చేయించేందుకు పల్లె వాసులు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. సాధారణంగా రెండు సెంట్లలో ఇంటి నిర్మాణానికి రూ.15లక్షల నుంచి రూ.20 లక్షల వరకు అవుతోంది. అదనపు హంగులు కోరుకుంటే మరో రూ.5లక్షల నుంచి ఆపైనే పెరుగుతుంది. అయినప్పటికీ నిర్మాణదారులు వెనకడుగు వేయడం లేదు.

ఆకట్టుకునేలా రంగులు..

ఇంటికి చేసిన ఎలివేషన్‌కు తగ్గట్టుగా రంగులు వేయడం కూడా ఓ కళ. . ఎలివేషన్, ఇంట్లో గదులకు సరిపడేలా ఆకట్టుకునేలా రంగులు వేసి భళా అనిపించుకుంటున్నారు. వీరు చేసిన డిజైన్, రంగులను చూసి మిగిలిన నిర్మాణదారులు కూడా అదే పద్ధతిలో నడుస్తున్నారు. ప్రస్తుతం పల్లెల్లో రెండు సెంట్ల ఇంటికి దాదాపు రూ.25లక్షల నుంచి రూ.30లక్షలకు పైగానే వెచ్చిస్తున్నారు.

నచ్చిన విధంగా కట్టుకోవాలని..



ఇల్లు కట్టుకునేటప్పుడు ఎలివేషన్‌ను అందంగా ఏర్పాటు చేసుకోవాలనుకున్నా. హైదరాబాద్‌లో మేం పనిచేసే యజమాని ఇల్లు చూసి అలా ఉండాలని అనుకున్నాం. ప్రస్తుతం మా ఇంటి పని పూర్తయ్యింది. ఆ ఇంటి లాగే నిర్మించుకున్నాం. ఖర్చుకు వెనుకాడకుండా ఎలివేషన్‌ను అందంగా తీర్చిదిద్దాం. అందుకు తగ్గట్టుగా రంగులు వేయించా. ఇంట్లో కూడా వాస్తు ప్రకారం సౌకర్యాలు ఉండేలా చూసుకున్నాం. – నెట్టేకల్లు, పగిడిరాయి

అందంగా ఉండాలని..



ఇల్లు బాగా కట్టుకోవాలని కోరికతో ఖర్చుకు వెనుకాడలేదు. మళ్లీ మళ్లీ కట్టుకోలేమని అందంగా కట్టుకున్నాం. ఇంటిపై ఎంత శ్రద్ధపెట్టామో ఎలివేషన్‌పై కూడా అంతే శ్రద్ధ పెట్టి ఇల్లు నిర్మించుకున్నాం. అలాగే ఇంట్లో అన్ని వసతులు ఉండేలా చూసుకున్నాం. హాలు, వంటిళ్లు, పడకగది, బాత్‌రూంలు పద్ధతి ప్రకారం, మాకు అవసరమైన మేరలో ఏర్పాటు చేయించుకున్నాం. మొక్కలకు కూడా కొంత స్థలం వదులుకున్నాం.

– శీనునాయక్, జాఫ్లాతండా

గ్యాస్ కోసం పడిగాపులు



ఇండేన్ గ్యాస్ వాహనం కోసం ఖాళీ సిలిండర్లను క్యూలో పెట్టి వేచి చూస్తున్న వినియోగదారులు

హొళగుంద: ఇండేన్ గ్యాస్ కోసం వినియోగదారులు ఆదివారం గంటల తరబడి ఎండలోనే పడిగాపులు కాసారు. ప్రతి ఆదివారం గ్యాస్ డెలివరీ చేయడానికి ఆదోని నుంచి వస్తున్న వాహనం మధ్యాహ్నం అవుతున్నా గ్రామానికి చేరుకోకపోవడంతో వినియోగదారులు అసహనానికి గురయ్యారు. పొలాలకు వెళ్లకుండ, ఇతర పనులను వాయిదా వేసుకుని ఎదురుచూడాల్సి వస్తోందని వ్యవసాయ కూలీలు గంగమ్మ, మల్లమ్మ, సిద్ధప్ప తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. సక్రమంగా గ్యాస్ పంపిణీ చేయకపోవడం వల్ల హొళగుందలో ఎండలో పడిగాపులు కాస్తున్నామని, పల్లెల నుంచి వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రతి సారి ఇలా గంటల తరబడి వేచి చూసి విసిగిపోతున్నామని పంపిణీలో నిర్లక్ష్యం చేస్తున్న బాధ్యులపై అధికారులు చర్యలు తీసుకుని గ్యాస్ ఏజెన్సీని స్థానికంగా ఉండేలా చూడాలని వినియోగదారులు కోరారు.

కలలను సాకారం చేసుకోండి



ఇంగళదహాళ్ బీసీ హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ బాల నరసింహులు

హొళగుంద: విద్యార్థులు బాగా చదివి తమ, తల్లిదండ్రుల కలలను సాకారం చేసుకోవాలని ఎస్‌ఐ బాల నరసింహులు సూచించారు. ఆదివారం ఇంగళదహాళ్ బీసీ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఉన్నత చదువులు చదివి, జీవితంలో ఉన్నత స్థానంలో ఉండాలని మీ తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని, వారి శ్రమను వృథా కానివ్వకుండా కష్టపడి, ఇష్టంతో, క్రమశిక్షణతో చదవి లక్ష్యాన్ని చేరుకోవాలని చెప్పారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు..

అనేక పద్ధతుల్లో ఏమార్చి మోసాలకు పాల్పడే సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దని, వారు సెల్‌ఫోన్‌లో పంపించే మెసేజ్‌లు, లింక్‌లను ఓపెన్ చేయకుండ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ మద్దిలింగదహాళ్ గ్రామస్తులకు సూచించారు. ఆదివారం ఆయన గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని, డబ్బులు పంపవద్దని, అలాంటి సంఘటనలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అలాగే రికార్డులు లేకుండా తిరుగుతున్న వాహనాలను తనిఖీ చేసి జరిమానా విధించారు. ట్రైనీ ఎస్‌ఐ బాషా ఉన్నారు.

జయప్రదం చేయండి

ఆలూరు రూరల్: సీపీఎం మండల 3వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి షాకీర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జ్యోతిబసు భవన్‌లో పార్టీ సీనియర్ నాయకుడు నారాయణ స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ,కార్మిక,మహిళా,రైతు పక్షాన సీపీఎం నిరంతర పోరాటం చేస్తోందన్నారు. ఈ నెల 4వ తేదిన జ్యోతిబసు భవన్‌లో జరుగుతున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మహాసభల్లో వేదావతి ప్రాజెక్టు నిర్మాణం, వివిధ సమస్యల పరిష్కారం కోసం తీర్మానాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈరన్న,విఠల్, కృష్ణ,నాగరాజు, షేకన్‌బీ, రత్నమ్మ, గౌసియాబీ పాల్గొన్నారు.

4న వీరయ్యస్వామి ఆరాధన మహోత్సవం

ఆదోని అర్బన్: బసాపురం రోడ్డులోని వ్యవసాయ మార్కెట్‌యార్డు గేటు సమీపంలోని మఠంలో వెలిసిన శ్రీ గవి వీరయ్యస్వామి వారి 96వ ఆరాధన మహోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు మఠం ధర్మకర్త శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి వేకువజాము నుంచి ధ్వజారోహణ పూజలు, పంచామృతాభిషేకం, మహా మంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అన్నదానం ఉంటుందన్నారు.

జొన్న పంటకు 'ఫెంగల్' ఎఫెక్ట్

- కురుస్తున్న చినుకులతో పైరు దెబ్బతినే అవకాశం
- పొగమంచుతో నల్లగా మారుతున్న గింజలు
- రైతుల్లో ఆందోళన



కమ్మేసిన పొగమంచు



కంకి దశలో జొన్న పైరు

ఆలూరు: చలి కాలం కావడంతో పొగ మంచు తీవ్రంగా కురుస్తోంది. దీనికి తోడు ఫెంగల్ తుఫాను కారణంగా నాలుగు రోజుల నుంచి అడపా దడపా చినుకులు రాలుతున్నాయి. దీంతో ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో విస్తారంగా సాగైన జొన్న పంట దెబ్బతినే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సబ్ డివిజన్‌లో బిస్కెట్ల తయారీలో ఉపయోగించే రకం జొన్న పంటను అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం పంట కంకి దశలో ఉంది. ముందస్తుగా సాగు చేసిన ప్రాంతాల్లో కోత దశలో ఉంది. సబ్‌డివిజన్‌లోని చిప్పగిరి మండలంలో 4,500 ఎకరాలు, హాలహర్విలో 3వేల ఎకరాలు, దేవనకొండ 300 ఎకరాలు, ఆలూరు మండలంలోని మొలగవెల్లి,కురువెల్లి,పెద్దహోతూరులో 300 ఎకరాల్లో జొన్న పంట సాగైంది. సాయంత్రం నుంచే పొగ మంచు మొదలై.. అర్ధరాత్రి దాటిన తరువాత తీవ్రంగా మారుతోంది. ఉదయం ఎనిమిది గంటలైనా విడవకపోతుండటంతో మంచు బిందువులకు గింజలు నల్లగా మారుతున్నాయి. అలాగే తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజులుగా చినుకులు రాలుతుండటంతో పంట మరింత దెబ్బతినే అవకాశముంది. చిప్పగిరి మండలం బెల్డోణ, నగరడోణ, రామదుర్గం,దేవనకొండ మండలం అలారుదిన్నె ,కుంకనూరు, కూకటికొండ, కరివేముల ,ఆస్పరి మండలం ముతుకూరు, యాటకల్లు, బైలుపత్తికొండ, హాలహర్వి మండలం గూళ్యం, బాపురం, సిద్ధాపురం, అమృతాపురం, చింతకుంట, కొక్కెరచేడు బేవినహాళ్, ఆలూరు మండలం మొలగవెల్లి ,కురుకుంద ,కమ్మరచేడు తదితర గ్రామాల్లో రైతులు బిస్కెట్ జొన్నతో రాయచూరు జొన్న పంటను సాగుచేశారు. పంటలపై సోకిన నల్లటి కాటుక రంగును నివారించుకోవడానికి వ్యవసాయ అధికారులు సూచనలు చేయాలని నగరడోణ గ్రామానికి చెందిన రైతులు కురుబ ఈరన్న, వెంకటరెడ్డి, మల్లయ్య కోరారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



కార్తీక దీపాల వెలుగులో వరబసవేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామి



ఎల్లార్తి దర్గాలో సమాధులను దర్శించుకుంటున్న భక్తులు

దేవనకొండ: మండలంలోని దేవనకొండ, పి.కోట కొండ, తెర్నెకల్, కూకటికొండ తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ఆంజనేయస్వామి, శివాలయం, సుంకులమ్మవ్వ, దుర్గామాతలకు ఆదివారం అమావాస్య పూజలు నిర్వహించారు. భక్తులు 108 సార్లు బిందెలతో పి.కోటకొండలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివుడికి అభిషేకం చేశారు. భక్తుల రాకతో ఆలయం కిటకిటలాడింది.

హొళగుంద: మండల కేంద్రం సమీపంలో కోగిలతోట రోడ్డులో వెలిసిన శ్రీవర బసవేశ్వస్వామి ఆలయ ఆవరణలో కార్తీక మాసం అమావాస్య సందర్భంగా ఆదివానం దీపోత్సవ కార్యక్రమం వైభవంగ జరిగింది. స్వామి వారికి పూజారులు రుద్రాభిషేకం, మహామంగళ హారతి, నైవేద్య సమర్పణ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలో వివిధ ఆకారాల్లో మహిళలు దీపాలను వెలిగించారు.

ఆదివారం అమావాస్య సందర్భంగా మండలంలోని ఆలయాలు, దర్గాల్లో ప్రత్యేక పూజలు, ఫాతెహాలు జరిగాయి. దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామి, హొళగుంద సిద్ధేశ్వరస్వామి ఆలయాలలో పూజారులుఅభిషేకాలు, అర్చనలు చేపట్టి నైవేద్యం సమర్పించారు. స్థానిక సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు, కాగడ హారతులు, ఇతర పూజలు జరిగాయి. ఎల్లార్తి షేక్షావలి, షాషావలి, హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు.



భవన గాయత్రి దేవాలయంలో గాయత్రి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి వద్ద వెలసిన శ్రీ భువనగాయత్రి ఆలయంలో ఆదివారం పీఠాధిపతి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక గాయత్రి హోమం నిర్వహించారు. ఆదివారం ఆమావాస్య కలిసి రావడంతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, సప్తహారతుల కార్యక్రమం జరిపించారు. గాయత్రి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి జూలకంటి రఘునాథ్‌రెడ్డి, అభయ అంజనేయస్వామి పీఠాధిపతి రామాంజనేయులు, ట్రస్ట్ సభ్యులు జగదీష్, లక్ష్మిసరోజ, రమణాచలం, ఐరన్‌షాప్ రాము, హరినాథ్ ఆచారి పాల్గొన్నారు.



రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



టోపీ మారెమ్మవ్వ

హాలహర్వి: మండలంలోని గూళ్యం గాదిలింగేశ్వరస్వామి, అమ్మతాపురం టోపీ మారెమ్మవ్వ, దిబ్బల సోమప్ప, క్షేత్రగుడి ఆంజనేయస్వామి, విరుపాపురం బల్లోటేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆంధ్ర నుంచే గాక కర్ణాటక రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



పూజలందుకున్న బల్లోటేశ్వరస్వామి

కరాటే చాంపియన్‌షిప్‌లో కాంస్యం

కర్నూలు (టౌన్): గత నెల 28 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు సింగపూర్‌లో నిర్వహించిన పసిఫిక్ షిటోర్యు కరాటే చాంపియన్‌షిప్‌లో కర్నూలుకు చెందిన కరాటే మాస్టర్ డాక్టర్ కోలా ప్రతాప్‌కుమార్ కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాంపియన్‌షిప్ పోటీల్లో 29 దేశాలు పాల్గొన్నాయన్నారు. భారత్ నుంచి 40 మంది కరాటే మాస్టర్లు పాల్గొన్నగా ఆంధ్రప్రదేశ్ నుంచి తాను ప్రాతినిధ్యం వహించానన్నారు. 45 ఏళ్ల విభాగం వెటరన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని పతకం సాధించడంపై ఆయన్ను పలువురు క్రీడాభిమానులు అభినందించారు.

సంప్రదాయాలకు అనుగుణంగా నడుచుకోవాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

ఆలూరు: హిందువులు సంప్రదాయాలకు అనుగుణంగా నడుచుకోవాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. పట్టణ సమీపంలోని శ్రీబెళ్లగుండ అంజనేయ స్వామి నూతన విగ్రహం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హిందువులు– ఆచార వ్యవహారశైలి, హైందవ సంప్రదాయాలు అనే అంశాలపై సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా పాల్గొన్న శ్రీనివాసులు, ఆలూరుకు చెందిన పంచాంగకర్త గురు రాజరవి శాస్త్రి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. కులాలకు అతీతంగా ఆలయాలను సూర్యోదయానికి ముందుగా సందర్శించాలని సూచించారు. శాఖాహారాన్ని మితంగా తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వీకె.చౌదరి, శ్రీనివాసులు,ఆర్గనైజింగ్ కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, రఘునాథ్ రెడ్డి, నాగేంద్రయ్యశెట్టి పాల్గొన్నారు.

పరిస్థితి అదే...స్థలం మారిందంతే!

- మూలకు చేరిన చెత్త తరలించే ట్రై సైకిళ్లు
- మాయమవుతున్న విడిభాగాలు
- గతంలో బళ్లారి రోడ్డులోని ఓ పొలంలో పడేయగా..
- ప్రస్తుతం సంత మార్కెట్ సచివాలయానికి చేర్చినా నిరుపయోగంగానే



హొళగుంద సచివాలయం–1 వెనుక నిరుపయోగంగా పడి ఉన్న చెత్త తరలించే ట్రైసైకిళ్లు

హొళగుంద: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్త ఇళ్ల నుంచి సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించేందుకు ప్రభుత్వం ట్రైసైకిళ్లను పంచాయతీలకు అందజేసింది. అయితే వాటిని వినియోగించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మండలానికి మంజూరైన ట్రై సైకిళ్లను మండల కేంద్రం సమీపంలోని బళ్లారి రోడ్డులోనున్న ఓ పొలంలో నిల్వ ఉంచారు. వాటిని వాడుకోకుండా వదిలేయడంతో తుప్పపట్టిపోవడమే గాకుండా విడిభాగాలు చోరీకి గురయ్యాయి. ఒక్కో ట్రై సైకిల్ రూ.40 వేలకు పైగా విలువ చేస్తుందని, ఇలా 16 ట్రైసైకిళ్లను వినియోగించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో అప్పట్లో అధికారులు స్పందించి వాటిని భద్రపరచాలని 16 ట్రై సైకిళ్లను సంతమార్కెట్ వద్దనున్న సచివాలయం–1 వెనకనున్న ప్రాంతానికి తరలించారు. అంతటితో తమ పని ముగిసిందని అధికారులు చేతులు దులుపుకున్నారు. ఆ తరువాత వాటి ఊసే మరిచారు. ప్రస్తుతం అవి తప్పు పట్టిపోతూ, విడి భాగాలు మాయమవుతున్నాయి. దీంతో స్థలం మార్చినా వాటి పరిస్థితిలో మార్పు లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పంచాయతీల వారీగా వచ్చిన ఈ సైకిళ్లు చాలా కాలంగా వినియోగించుకోకుండా ఇక్కడే పడి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతోనే సమస్యకు మూలకారణమని పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు పేర్కొంటున్నారు. వారి నిర్లక్ష్యంతోనే సైకిళ్ల విడిభాగాలు చోరీకి గురతుండటం, తుప్పు పట్టిపోతున్నా పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంపై ప్రజలు మండిపడుతున్నారు.